VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 137
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
ఆదివారం 25 అక్టోబర్ 2026

# గత ఐదేళ్లలో శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని సీఎం చంద్రబాబు ఆరోపణ

● ప్రజల నమ్మకంతో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందిస్తున్నామని వెల్లడి ● కోల్పోయిన బ్రాండ్ ఏపీని పునరుద్ధరించి, పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని స్పష్టీకరణ



**అమరావతి,కలంకౌంటర్ :** వైసీపీ అధినేత జగన్ తీరుపై సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో జగన్ 'హిట్ అండ్ రన్' విధానాన్ని అవలంబించారని, క్రిమినల్ లిటిగెంట్‌గా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థలను నాశనం చేశారని మండిపడ్డారు. ఈ మేరకు వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఘటనలపై 'అదే హింస.. అవే అబద్దాలు.. అవే అరాచకాలు..' పేరుతో ఓ బుక్‌లెట్‌ను, సంబంధిత వీడియోలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు రాష్ట్రంలో నక్సల్స్, రాయలసీమలో ఫ్యాక్షన్ గొడవలు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే, గత ప్రభుత్వ హయాంలో ఒక రాజకీయ పార్టీయే శాంతిభద్రతలకు అతిపెద్ద సమస్యగా మారిందని విమర్శించారు. వైఎస్ హయాంలో ఫ్యాక్షనిజంతో ప్రజలు భయపడితే, 2019 తర్వాత వైసీపీ పాలనలో ఎన్నికలను అపహాస్యం చేసి, పాలనను పూర్తిగా విధ్వంసం చేశారని ఆరోపించారు. స్వయానా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తన ప్రాణాలకు భయం ఉందని ఫిర్యాదు చేసే దుస్థితి ఏర్పడిందని గుర్తుచేశారు. గత ప్రభుత్వ అరాచకాలకు, విధ్వంసకర పాలనకు విసిగిపోయిన ప్రజలు 2024 ఎన్నికల్లో చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని చంద్రబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం రికార్డు స్థాయిలో 94 శాతం స్ట్రైక్ రేట్‌తో, 57 శాతం ఓట్లను సాధించిందని, ఇది ప్రజలు మాపై పెట్టుకున్న అపారమైన నమ్మకానికి నిదర్శనమని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, అధికారంలోకి వచ్చిన రోజు నుంచే పనిలో నిమగ్నమయ్యామని చెప్పారు. తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు అంశాలపై ప్రధానంగా దృష్టి సారించిందని ముఖ్యమంత్రి వివరించారు. గత పాలనలో దెబ్బతిన్న 'బ్రాండ్ ఏపీ'ని పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో ఏపీ బ్రాండ్ ఇమేజ్‌తోనే రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించగలిగామని గుర్తుచే శారు. పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇవ్వడం ద్వారానే ఉపాధి కల్పన సాధ్యమవుతుందని, కేవలం ఒప్పందాలు చేసుకోవడమే కాకుండా, అవి ఉత్పత్తి దశకు వెళ్లేంత వరకూ ఫాలో అప్ చేసే పటిష్టమైన విధానాన్ని అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఏపీకి మళ్లీ పెట్టుబడులు వస్తున్న విషయాన్ని పొరుగు రాష్ట్రాలతో పాటు యావత్ దేశం గుర్తిస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు.

# కూటమి నాయకులు వినతిపత్రం





**అమరావతి,కలంకౌంటర్ :** ప్రజాస్వామ్య పరిరక్షణకు సిట్ ఏర్పాటు చేసి, ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాను కలిసి కూటమి నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి డా. ఏ. మల్లికార్జున, ఐజీ బి. రాజకుమారి పాల్గొన్నారు.

## విజయవాడ టీడీపీలో రెబల్స్‌పై వేటు.. ఏడుగురు నేతల సస్పెన్షన్!

- 2లో

# కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా.. మహారాష్ట్రకు సీఎం రేవంత్ రెడ్డి

● సోమవారం జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా ● తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు బోర్డు నిర్ణయం ● సీఎం రేవంత్ రెడ్డి ముంబై పర్యటన కారణంగా అధికారులు హాజరుకాలేరని వెల్లడి ● మంగళవారానికి సమావేశాన్ని తిరిగి షెడ్యూల్ చేసిన కేఆర్ఎంబీ



**తెలంగాణ, కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల పంపిణీపై చర్చించేందుకు సోమవారం (అక్టోబర్ 26) జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) 21వ సమావేశం వాయిదా పడింది. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మే-రకు ఈ భేటీని మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు బోర్డు ప్రకటించింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ముంబై పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరు కాలేరని తెలంగాణ ఇంజనీర్-ఇన్-చీఫ్ కేఆర్ఎంబీకి లేఖ ద్వారా తెలియజేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు సంబంధించిన కీలక చర్చల నిమిత్తం ముఖ్యమంత్రి మహారాష్ట్రకు వెళుతున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ కారణం చేత సమావేశాన్ని వాయిదా వేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న కేఆర్ఎంబీ, సమావేశాన్ని మంగళవారానికి రీషెడ్యూల్ చేసింది. ఈ మార్పునకు సంబంధించిన సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు అధికారికంగా తెలియజేసింది. తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలు, నీటి పంపిణీకి సంబంధించిన కీలక అంశాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు.

# బందరు కార్పొరేషన్ కూటమిదే..

## -కూటమి పాలనలోనే బందరు అభివృద్ధి - మంత్రి కొల్లు రవీంద్ర





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి జెండా ఎగరేయడం తథ్యమని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మచిలీపట్నం నగరంలోని 58, 60వ డివిజన్ల అభ్యర్థులు వడ్డీ చిరంజీవి, వల్లే సీతామహ లక్ష్మీ, పార్టీ సీనియర్ నాయకులు కొనకళ్ల జగన్నాథ రావు గారు, కూటమి మేయర్ అభ్యర్థి అబ్దుల్ అబిదా గారితో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ హామీలను, చేసిన అభివృద్ధిని వివరించారు. పట్టణంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమాలకు ప్రజల నుంచి చాలా మంచి స్పందన లభిస్తోందని, కూటమి అభ్యర్థులను అమూల్యమైన ఓట్లతో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఘనమైన చరిత్ర కలిగిన మచిలీపట్నంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో తరకటూరులో 200 ఎకరాల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేశాం. వాటర్ ఫిల్ట్రేషన్ కోసం రూ. 16 కోట్లు వెచ్చించి ప్రతిరోజూ మంచినీరు అందించేలా చర్యలు చేపట్టాము. భవిష్యత్తులో కృష్ణా నీటిని నేరుగా పంపింగ్ చేసి మచిలీపట్నానికి తీసుకువచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. గతంలో నిలిచిపోయిన డ్రైనేజీ పనులను మళ్లీ గాడినపెట్టి, సుమారు రూ. 65 కోట్ల వ్యయంతో నూతన పనులు చేపట్టబోతున్నట్లు ప్రకటించారు. నివాస స్థలాల కేటాయింపు, జిం3 ఇళ్ల నిర్మాణం ద్వారా ప్రతి ఒక్కరికీ స్వగృహం కల్పించడమే తమ లక్ష్యం. అదేసమయంలో రోడ్లు డ్రైనేజీలు, స్ట్రీట్ లైట్లు మరియు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందిస్తున్నాం. ఆక్రమణకు గురైన పార్కులను పునరుద్ధరించడంతో పాటు, సీఎస్ఆర్ ఫండ్స్ మరియు ఫీనిక్స్ సంస్థ సహకారంతో రూ. 1.5 నుండి 2 కోట్ల వ్యయంతో శ్మశానవాటికలను సుందరమైన పార్కులుగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ వద్ద ఇప్పటికే ఫైలాన్ పార్క్‌ను ఏర్పాటు చేసినట్లు మంత్రి కొల్లు రవీంద్ర గుర్తుచేశారు.











# రాష్ట్ర ఎన్నికల సంఘం విఫలమైంది

● మాజీ శాసనసభ్యులు, గిద్దలూరు వైఎస్సార్ సీపీ ఇన్చార్జి నాగార్జున రెడ్డి.



**గిద్దలూరు,కలంకౌంటర్ :** గిద్దలూరు నియోజకవర్గం లోని ఆరు మండలాల్లో వైసీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని మాజీ ఎమ్మెల్యే, గిద్దలూరు వైఎస్సార్ సీపీ ఇన్చార్జి కెపి నాగార్జున రెడ్డి అన్నారు. గిద్దలూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. నామినేషన్ కేంద్రాల వద్ద కూటమి నేతలు వందల సంఖ్యలో కిరాయి మూకలు, బౌన్సర్లను పెట్టండి అడ్డంకులు సృష్టించారని విమర్శించారు . గిద్దలూరు నియోజకవర్గంలో తాము ఎక్కడా నామినేషన్ లు వేయలేదని అన్నారు. నామినేషన్ పత్రాలు చించివేసిన ఘటనలు జరిగాయని ఆరోపణ. 75 ఎంపీటీసీ స్థానాల నామినేషన్లపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని వెల్లడించారు. ఎటువంటి ఆటంకం లేకుండా సజావుగా ఎన్నికలు జరిగితే 75 ఎంపీటీసీ స్థానాల్లో 60--65 స్థానాలు, ఆరు ఎంపీపీ స్థానాల్లో ఐదు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ విజయాన్ని అడ్డుకోవాలనే ఉద్దేశంతోనే కూటమి నేతలు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు.

# పరిశీలన





**విజయనగరం,కలంకౌంటర్ :** జిల్లా పరిధిలో జరుగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన ప్రక్రియ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ లిఎఆర్ దామోదర్ పర్యవేక్షించారు. ఇందులో భాగంగా కొత్తవలస, వేపాడ, ఎల్.కోట నామినేషన్ల కేంద్రాల వద్ద, ఎస్.కోట అసెంబ్లీ నియోజక వర్గ స్ట్రాంగ్ రూం ఏర్పాటు చేసిన బొడ్డవర సమీపంలోని వరలక్ష్మి స్కూల్ వద్ద పోలీసు బందోబస్తు, భద్రత ఏర్పాట్లను జిల్లా ఎస్పీ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐ ఏవీ లీలారావు, ఎస్.కోట రూరల్ సిఐ ఎల్.హిమగిరి, ఎస్.కోట సిఐ వి.ఎన్.మూర్తి, ఎస్సైలు జోగారావు, సుదర్శన్, రామకృష్ణ, లక్ష్మణరావు పాల్గొన్నారు.

# వైసీపీ అభ్యర్థి ప్రచార జోరు





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** స్థానిక 47 వ డివిజన్ లో వైసీపీ మేయర్ అభ్యర్థి లంకా జ్యోతి తో కలిసి కార్పొరేటర్ అభ్యర్థి ఎస్ ఎన్ గుప్తా ప్రచారం జోరుగా సాగించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపిస్తే మీ సేవకుడిగా డివిజన్ లో అందుబాటులో ఉంటానని, మాజీ మంత్రి పేర్ని నాని గత ప్రభుత్వం లో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు దృష్టిలో పెట్టుకోవాలని విజ్ఞప్తి చేసారు. అడుగడుగునా ప్రజలు నీరాజనం పలికారు. ఈ కార్యక్రమం లో మాజీ మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, వైసీపీ నాయకుడు షేక్ సలార్ దాదా, వేముల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బంగాళాఖాతంలో బలపడుతున్న అల్పపీడనం

**విజయవాడ, కలంకౌంటర్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి తుపానుగా మారేందుకు సిద్ధమవుతోంది. ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో ఏర్పడుతున్న ఈ తొలి తుపానుకు 'ఆర్నాబ్' అని పేరు పెట్టనున్నారు. ఇది ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. శుక్రవారం తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది శనివారం నాటికి వాయుగుండంగా, ఆదివారానికి తీవ్ర వాయుగుండంగా మారి, సోమవారం (అక్టోబర్ 26) ఉదయానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడనుంది. ఆ తర్వాత పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ అక్టోబర్ 27, 28 తేదీల్లో ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరాల వైపునకు చేరుతుందని ఐఎండీ అంచనా వేస్తోంది. తుపాను ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్ర జిల్లాల్లో గంటకు 70 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. కొన్ని వాతావరణ నమూనాలు ఇది మరింత బలపడి తీవ్ర లేదా అతి తీవ్ర తుపానుగా మారవచ్చని సూచిస్తున్నాయి. ఈ నెల 27, 28 తేదీల్లో శ్రీకాకుళం నుంచి పశ్చిమ గోదావరి వం-కు భారీ నుంచి అతి భారీ వర్షాలు, అక్కడక్కడా కుంభవృష్టి కురిసే అవకాశం ఉంది.

# విజయవాడ టీడీపీలో రెబల్స్‌పై వేటు.. ఏడుగురు నేతల సస్పెన్షన్!

● విజయవాడలో ఏడుగురు టీడీపీ నేతలపై సస్పెన్షన్ వేటు! ● కూటమి ధర్మానికి విరుద్ధంగా వ్యవహరించారంటూ పార్టీ ప్రకటన! ● రెబల్స్‌గా పోటీ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకున్న టీడీపీ ● విజయవాడ కార్పొరేషన్ ఎన్నికల సీట్ల సర్దుబాటులో అసంతృప్తి ● సస్పెండైన నేతలతో పార్టీకి సంబంధం లేదని స్పష్టీకరణ

**విజయవాడ, కలంకౌంటర్ :** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల వేళ టీడీపీ క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. విజయవాడ కార్పొరేషన్‌లో కూటమి ధర్మానికి విరుద్ధంగా వ్యవహరిస్తూ, రెబల్స్‌గా పోటీ చేస్తున్న ఏడుగురు నేతలను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. సస్పెండైన వారిలో కాకొల్లు మహేంద్ర నాథ్ (బాబీ), దేవరపు మాల్యాద్రి, గెడ్డం శ్రీనివాసరావు, కోట నారాయణ, చంద్రశేఖర్, కొమ్మినేని సురేశ్, మాదాల సత్యవతి ఉన్నారు. ఈ నేతలతో టీడీపీకి ఇకపై ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది.

**ఎందుకీ సస్పెన్షన్?** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా పోటీ చేస్తున్నాయి. ఈ క్రమంలో విజయ-వాడ కార్పొరేషన్‌లోని కొన్ని డివిజన్లను పొత్తులో భాగంగా జనసేన, బీజేపీలకు కేటాయించారు. అయితే, టీడీపీ నుంచి టికెట్ ఆశించి భంగపడిన కొందరు నేతలు అసంతృప్తికి గురై రెబల్స్‌గా, స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగారు. ముఖ్యంగా 69వ డివిజన్‌ను కూటమి ఒప్పందంలో భాగంగా జనసేన పార్టీకి కేటాయించారు. అక్కడ టీడీపీ టికెట్ ఆశించిన కాకొల్లు మహేంద్రనాథ్ (బాబీ) పార్టీ ఆదేశాలను ధిక్కరించి రెబల్‌గా నామినేషన్ వేశారు. నామినేషన్ ఉపసంహరించుకోవాలని పార్టీ సూచించినా ఆయన పట్టించుకోలేదు. అలాగే, 1వ డివిజన్‌లో టీడీపీ అధికారిక అభ్యర్థి గుడిపాటి సౌజన్య కాగా, భార్యకు టికెట్ ఆశించిన కొమ్మినేని సురేశ్, మాదాల సత్యవతి వంటి వారు స్వతంత్రులుగా పోటీకి దిగారు. ఈ రెబల్ అభ్యర్థులకు సహకరిస్తున్న వారిని కూడా పార్టీ గుర్తించింది. మహేంద్రనాథ్‌తో పాటు ఆయనకు మద్దతిస్తున్న దేవరపు మాల్యాద్రి, గెడ్డం శ్రీనివాసరావు, కోట నారాయణ, చంద్రశేఖర్‌లను కూడా పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. కూటమి ధర్మాన్ని పాటించని వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఈ చర్యల ద్వారా పార్టీ అధిష్ఠానం స్పష్టమైన సంకేతాలు పంపింది.

# కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ఎంపి మాగుంట శ్రీనివాసరెడ్డి ప్రచారం....





కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎంపి మాగుంట శ్రీనివాసరెడ్డి



భారీ ర్యాలీగా ఎన్నికల ప్రచారం...

**మార్కాపురం,కలంకౌంటర్ :** మార్కాపురం మున్సిపల్ ఎన్నికల్లో కూటమి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి వక్కలగడ్డ మల్లికార్జున మరియు కూటమి కౌన్సిలర్ అభ్యర్థుల గెలుపు కోసం శనివారం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి ప్రచారం నిర్వహించారు.మార్కాపురం పట్టణంలో 09,10,11,12వ వార్డులలో ప్రచార కార్యక్రమం నిర్వహించిన ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లా కేంద్రం అభివృద్ధి కోసం ఎన్ డిఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి , జనసేన పార్టీ మార్కాపురం జిల్లా నాయకులు ఇమ్మడి కాశీనాథ్ , బిజెపి జిల్లా అధ్యక్షులు పివి కృష్ణారావు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు కౌన్సిలర్ అభ్యర్థులు పాల్గొన్నారు.

# గిద్దలూరు మున్సిపల్ ఎన్నికలలో త్రిముఖ పోటీ..

● ఎన్ డిఏ చైర్మన్ అభ్యర్థిగా డా జెవి నారాయణ.... ● వైఎస్సార్ సీపీ చైర్మన్ అభ్యర్థిగా డా.భూమా బాల నరసింహారెడ్డి.....

● స్వతంత్ర అభ్యర్థిగా పాలుగుళ్ళ శివ సాయి ప్రతాప్ రెడ్డి......



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బిజెపి అభ్యర్థి డాక్టర్ నారాయణ...



గిద్దలూరు పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు



ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ భూమా బాల నరసింహారెడ్డి

**గిద్దలూరు,కలంకౌంటర్ :** గిద్దలూరు మున్సిపల్ ఎన్నికలలో త్రిముఖ పోటీ అనివార్యమైంది. ఎన్డీఏ కూటమి చైర్మన్ అభ్యర్థిగా డాక్టర్ జె వి నారాయణ పోటీలో ఉండగా వైఎస్ఆర్సిపి నుండి డాక్టర్ భూమా బాల నరసింహారెడ్డి పోటీలో ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా పాల్గొన్న శివసాయి ప్రతాపరెడ్డి టిడిపి నాయకుల మద్దతుతో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. టిడిపి కౌన్సిలర్ అభ్యర్థుల విజయం కోసం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కుటుంబ సభ్యులు టిడిపి నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కూటమి పొత్తులో భాగంగా ఎన్డీఏ చైర్మన్ అభ్యర్థిగా బిజెపి డా జెవి నారాయణ పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్నారు. మరోవైపు వైఎస్ఆర్సిపి చైర్మన్ అభ్యర్థిగా రంగంలోకి దిగిన డాక్టర్ భూమా బాల నరసింహారెడ్డి పట్టణంలోని అన్ని వార్డులలో కౌన్సిలర్ అభ్యర్థులను రంగంలోకి దించి ప్రచారపర్వం ప్రారంభించారు. అనూహ్యంగా ఎన్నికల తేదీ నవంబర్ ఒకటో తేదీకి మారడంతో ఎవరికి వారు గెలుపు కోసం వ్యూహాలకు పదును పెడుతున్నారు. డాక్టర్ జెవి నారాయణ విజయం కోసం రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు గిద్దలూరులో ప్రచారం నిర్వహించారు. అత్యధిక సంఖ్యాబలం కలిగిన బిసిలు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా డాక్టర్ జెవి నారాయణను గెలిపించాల్సిన ఆవశ్యకత ఉందని బిసి వర్గాలలో ప్రచారం నిర్వహిస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి దిగిన పి. శివ సాయి ప్రతాపరెడ్డి టిడిపి నాయకులు, కార్యకర్తల మద్దతుతో ప్రచారం నిర్వహిస్తున్నారు.

ఎన్నికలలో గెలుపు కోసం ఎవరికి వారు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు.

# టిడిపి సీనియర్ నాయకులు బంటుమిల్లి ప్రముఖులు పట్టపు రామచందర్రావు మృతి



పట్టపు రామచంద్ర రావు గారు

**బంటుమిల్లి,కలంకౌంటర్ :** బంటుమిల్లి పట్టణ ప్రముకులు, సీనియర్ తెలుగుదేశం నాయకులు బంటుమిల్లి మండల మాజీ టీ డి పి అధ్యక్షుడు ,మాజీ మంత్రి పేర్ని నాని మామ ,బంటుమిల్లి మండలపరిషత్ మాజీ అధ్యక్షురాలు పట్టపు సత్యనారాయణమ్మ భర్త అయిన పట్టపు రామచంద్ర రావు(80)శనివారం ఉదయం6:30 నిమిషాలకు ఆయన స్వగృహం లో తుది శ్వాస విడిచారు.. రామచంద్ర రావు మృతి వార్త తెలియగానే ఆయన స్వగ్రామైన చెరుకుమిల్లి గ్రామం నుండి మరియు బంటుమిల్లి పట్టణంలో పలువురు ఆయన మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మాజీ మంత్రి పేర్ని నాని ,మామగారి మృద్దేహానికి ఘనమైన నివాళులర్పించారు. పార్టీల రహితంగా పలువురు రామచంద్రరావు మృతికి సంతాపం వ్యక్తం చేశారు. మృతి చెందిన పట్టపు రామచందర్రావుకు భార్య,ఇద్దరు కుమార్తెలు మాజీ మంత్రి వైసిపి జిల్లా అధ్యక్షులు పేర్నివెంకటరామయ్య అలియాస్ నాని ,రామచంద్రరావుకు రెండువ అల్లుడు. శనివారం సాయంత్రం రామచంద్ర మృదేహానికి ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు

పట్టపు రామచంద్ర రావు గారు

# కందుకూరు టిడిపి కార్యాలయానికి విచ్చేసిన మంత్రి డోల





**కందుకూరు,కలంకౌంటర్ :** రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల శ్రీ వీరాంజనేయ స్వామి శనివారం కందుకూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్నికలు, రాజకీయ పరిణామాలపై శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మంత్రితో చర్చించారు. కందుకూరు మండలం మాచవరం - 2 స్థానం నుంచి ఎంపీటీసీగా ఏకగ్రీవమైన పొట్లూరు సుశీల, మంత్రి ని మర్యాదపూర్వకంగా కలవగా, ఆయన అభినందనలు తెలియజేశారు.



# 10వ వార్డులో పట్టు బిగిస్తున్న టిడిపి కౌన్సిలర్ అభ్యర్థి లొక్కు రాజమ్మ..

- వార్డు అభివృద్ధికి ఓటెయ్యాలని ఓటర్లకు వినతి.....
- లొక్కు రాజమ్మ విజయాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కుమారుడు లొక్కు రమేష్....



**గిద్దలూరు,కలంకౌంటర్ :** గిద్దలూరు మున్సిపల్ ఎన్నికలలో పదవ వార్డు నుంచి కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న లొక్కు రాజమ్మ ప్రచారంలో పట్టు బిగుస్తుంది. వార్డులోని ప్రతి ఓటరును కలిసి సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని కోరుతున్నారు. స్థానిక రాజకీయాలలో సుదీర్ఘ అనుభవం ఉన్న రాజమ్మ కుమారుడు లొక్కు రమేష్ తల్లి రాజమ్మ విజయాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. వార్డులోని స్నేహితులు, బంధువులు, శ్రేయోభిలాషులను ఎన్నికలలో తల్లి రాజమ్మను గెలిపించాల్సిందిగా కోరుతున్నారు. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి తో సన్నిహిత సంబంధాలు, గతంలో రెండు పర్యాయాలు కౌన్సిలర్ గా చేసిన అనుభవం వార్డు లో రోడ్లు, డ్రై న్లు , మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తానని అంటున్నారు. వార్డులో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందించే తమకు సైకిల్ గుర్తు పై ఓటేసి గెలిపించాలని కోరుతున్నారు....

# వైకాపాను వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్న నన్నం జస్టిస్



**కావలి,కలంకౌంటర్ :** నియోజకవర్గంలో ముసునూరుకు చెందిన వైకాపా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు నన్నం జస్టిస్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి అధికారికంగా తెలుగుదేశం పార్టీలో చేరారు.ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నన్నం జస్టిస్‌కు ఎమ్మెల్యే పార్టీ పసుపు కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నన్నం జస్టిస్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పాలన, నియోజకవర్గంలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షి తులై తాను టీడీపీలో చేరినట్లు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, బలోపేతానికి తనవంతు బాధ్యతగా శక్తివంచన లేకుండా పనిచేస్తానని స్పష్టం చేశారు.

# ఓటర్ల జాబితా ప్రదర్శన



**కందుకూరు,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సంఘం వారి ఆదేశాల మేరకు 865/ఎస్ ఈ సి -ఎఫ్ 2/2026, తేదీ :17-10-2026 ప్రకారం కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 1 నుండి 40 వార్డులకు సంబంధించిన వార్డుల వారీ ఫోటో ఓటర్ల జాబితాను 01.01.2026 అర్హత తేదీ ప్రాతిపదికగా తీసుకుని సిద్ధం చేయడమైనది. ఈ సమగ్ర ఓటర్ల జాబితాను శనివారం, అనగా 24-10-2026 న కందుకూరు పట్టణంలోని పురపాలక సంఘము కార్యాలయం, సబ్ కలెక్టర్ కార్యాలయము, తహశీల్దార్ కార్యాలయము, ఎమ్.పి.డి.ఓ కార్యాలయము వారి నోటీసు బోర్డుల నందు ఓటర్ల పరిశీలనార్థం ఉంచబడుతుందని మున్సిపల్ కమిషనర్ కే అనూష తెలిపారు.






# ఒంగోలు లో గేరుమార్చిన వైసిపి







**ఒంగోలు,కలంకౌంటర్ :** ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం వైఎస్ఆర్సిపి మేయర్ అభ్యర్థి కుప్పం ప్రసాద్ ప్రచారంలో దూకుడు పెంచారు. తనదైన శైలిలో ప్రజలు నాకట్టుకోవటానికి ప్రజల్లో మమేకమయ్యారు. ఇస్త్రీ బండి నుంచి కూరగాయల వర్తకులు వరకు అందర్నీ ఆత్మీయంగా పలకరించుతూ , వారి పనుల్లో చేదోడుగా కనిపించి నేను మీ వాడిని అనిపించాడు. దీంతో ఓటర్లలో నూతన ఉత్సాహం నిండింది. 20వ డివిజన్ అభ్యర్థి పొట్లూరు వెంకాయమ్మ తో ఈ ప్రాంతాల్లో ప్రచారం సాగింది. స్థానిక కోదండరామస్వామి ఆలయంలో పూజలు చేశారు . అనంతరం పోలేరమ్మ ఆలయంలో పూజలు చేశారు . ఈ సందర్భంగా కుప్పం ప్రసాద్ మాట్లాడుతూ. ఈ ప్రాంతాన్ని కార్పొరేషన్ అని చెప్పటానికి సిగ్గుపడేలా ఉందన్నారు. కనీసం గ్రావెల్ రోడ్లు కూడా లేని దుస్థితిలో ఆ ఏరియా ఉంది. అని వెల్లడించారు కాల్వలలో చెత్త ఎక్కడదిక్కడే వదిలేసారు అన్నారు. పారిశుధ్య సమస్య ఆ ప్రాంతంలో ఎక్కువగా ఉందని, దోమల బెడద వలన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, మండిపడ్డారు. మున్సిపల్ నిధులను ఆ ప్రాంత అభివృద్ధికి ఎందుకు మళ్లించారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర పార్టీ నాయకులు కటారి శంకర్ స్థానిక నాయకులు పాల్గొన్నారు .

# వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించండి

## -గుంటూరు వైసీపీ మేయర్ అభ్యర్థి శ్రీదేవి







**గుంటూరు,కలంకౌంటర్ :** నగరంలో వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని వైసీపీ మేయర్ అభ్యర్థి తాడికొండ శ్రీదేవి విజ్ఞప్తి చేశారు. శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం విస్తృతంగా నిర్వహించారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఆశీర్వాదించాలని విజ్ఞప్తి చేశారు.ఉదయం 1వ వార్డులో ప్రచారం నిర్వహించిన అనంతరం వైసీపీ మేయర్ అభ్యర్థి శ్రీదేవి 11వ వార్డు పరిధిలోని లాలాపేట, పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను కలుసుకుంటూ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు.తాము ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. ప్రజల నుంచి వస్తున్న స్పందన తమకు మరింత ఉత్సాహాన్ని ఇస్తోందని, ఎన్నికల్లో వందకు వంద శాతం విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపిస్తామని ఆమె పేర్కొన్నారు.

# మార్కాపురం పట్టణ అభివృద్ధి కోసం వైసిపి అభ్యర్థులను గెలిపించాలి..

- పట్టణంలోని 1,5వ బ్లాక్ లలో ప్రచారంలో పాల్గొన్న మాజి ఎమ్మెల్యే అన్నా, చైర్మన్ అభ్యర్థి కనకదుర్గ



మార్కాపురం పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు...



వార్డు కౌన్సిలర్లతో విస్తృతంగా ప్రచారం

**మార్కాపురం,కలంకౌంటర్ :** మార్కాపురం పట్టణ అభివృద్ధి కోసం వైఎస్ఆర్సిపి చైర్మన్ అభ్యర్థి డాక్టర్ చెప్పల్లి కనకదు-ర్గ, కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ ఇన్చార్జి అన్నా రాంబాబు కోరారు. లిమార్కాపురం పట్టణంలోని 1,5వ బ్లాక్ లలో ఇంటి ఇంటికి తిరిగి మాజీ ఎమ్మెల్యే,మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు ప్రచారం నిర్వహించారు 1,5వ బ్లాక్ లలో ఓటరు దేవుళ్లనుస్వయంగా కలసి ఓటును ఫ్యాన్ గుర్తు పై వేసి, వేయించి గెలిపించాలని కోరారు ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ తరపున మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ కనకదుర్గ గారిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రజలతో మమేకమవుతూ,వారి సమస్యలను తెలుసుకుంటూ సాగుతున్న ఈ ప్రచార కార్యక్రమం మార్కాపురం రాజకీయాల్లో ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. కనకదుర్గమ్మను గెలిపించండి మార్కాపురం మున్సిపాలిటీలో అభివృద్ధి అంటే ఎలా ఉండాలో చేసి చూపిస్తాం మార్కాపురం పట్టణంలో త్రాగునీరు,రోడ్లు,డ్రైనేజీ వ్యవస్థ వంటి పనుల నిమిత్తం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశాం. ఒక వైపు మున్సిపాలిటీగా అభివృద్ధి,మరోవైపు జిల్లా కేంద్రంగా విస్తరిస్తున్న దృష్ట్యా అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేసాం. మార్కాపురం ప్రజలారా ఒక్కసారి ఆలోచించండని కోరారు. ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులు మేడా బదరీ పాల్గొన్నారు..

# ఒక్క అవకాశం ఇవ్వండి

## 18వ డివిజన్ వైసీపీ అభ్యర్థి




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** నిత్యం డివిజన్ లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయడానికి ఒక్క అవకాశం ఇవ్వాలని 18 వ డివిజన్ వైసీపీ అభ్యర్థి తటవర్తి కృష్ణ శిరీష విజ్ఞప్తి చేసారు. శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం లో పేర్ని నాని చేసిన అభివృద్ధి చూసి ఫ్యాన్ గుర్తుకు ఓటయాలనీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో సీనియర్ వైసీపీ నాయకుడు తుమ్మలపల్లి జగన్నాథం, నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల కోసమే పోరాడుతా

## -29 వ డివిజన్ వైసీపీ అభ్యర్థి షేక్ అచ్చెభా




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** తనను గెలిపిస్తే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల కోసమే పోరాడతానని 29 వ డివిజన్ వైసీపీ అభ్యర్థి షేక్ అచ్చెభా ఓటర్లకు విజ్ఞప్తి చేసారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్లి గత ప్రభుత్వం లో నగరం అభివృద్ధికి పేర్ని నాని చేసిన కృషిని గుర్తు చేసారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.

# వైసీపీ అభ్యర్థి విస్తృత ప్రచారం




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** స్థానిక 17 వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థి ఉడత్తు సాయి కిరణ్ విస్తృత ప్రచారం చేసారు. డివిజన్ అభివృద్ధితో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటానని, మాజీ మంత్రి పేర్ని నాని లక్ష్యానికి అనుగుణంగా పని చేస్తానని తెలిపారు.

# మాలకొండ స్వామి వారి ఆదాయం రూ10,36,934/-లు



**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు నియోజకవర్గంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి రూ 10,36,934/-లు వచ్చాయని ఆలయ ఈవో పీ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఉదయం స్వామివారికి అభిషేకం, అష్టోత్తరం, హోమం, అమ్మవారికి కుంకుమార్చన ఆలయ అర్చకులు నిర్వహించారు. శనివారం భక్తులు స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కొంతమంది భక్తులు స్వామివారికి పొంగళ్ళు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. అన్న ప్రసాదానికి భక్తులు భారీగా విరాళాలు అందజేశారు. ఆన్లైన్ ద్వారా రూ 1,51,139/-లు, అన్న ప్రసాదానికి మామూలు విరాళాలురూ 2,39,320/-లు వచ్చాయని ఆలయ ఈవో తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో ఏర్పాట్లు చేశారు.వలేటివారిపాలెం ఎస్సై తమ సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.

# పదో డివిజన్ లో పట్టు బిగిస్తున్న కొట్టే వెంకట్రావు











**మచిలీపట్నం,కలంకౌంటర్ :** స్థానిక పదో డివిజన్ లో కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థి కొట్టే వెంకట్రావు విస్తృత ప్రచారం తో పట్టు బిగిస్తున్నారు. డివిజన్ అభివృద్ధికి, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కారం కోసం పని చేస్తానని చెబుతున్నారు. గ్లాస్ గుర్తుకు ఓటేసి అభివృద్ధికి చోటు ఇవ్వాలని విజ్ఞప్తి చేసారు. డివిజన్ అభివృద్ధి జరగాలంటే మీ ఓటు సద్వినియోగం చేసుకోవాలని, మన డివిజన్.. మన భవిష్యత్తు... ఓటు మీదే ఆధార పడి ఉందన్నారు. ఓటర్లు కొట్టే వెంకట్రావు కు ఘన స్వాగతం పలుకుతున్నారు. జనసేన నియోజకవర్గం ఇంచార్జి బండి రామకృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పంచపర్వాల చంటి, పలువురు నాయకులు కొట్టే వెంకట్రావు ను గెలిపించాలని విజ్ఞప్తి చేసారు.



మచిలీపట్నం కూటమి మేయర్ అభ్యర్థి ని అబ్దుల్ అబీదా ను నిడుమోలు నుంచి యువత మర్యాదపూర్వకంగా కలిసి ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.

# మేం గెలిస్తే వసతులు మెరుగు పరచడమే లక్ష్యం

**- కూటమి మేయర్ అభ్యర్థిని అబీదా**



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం ప్రజలకు వసతులు మెరుగు పరచడమే లక్ష్యంగా పని చేస్తానని కూటమి బలపర్చిన టీడీపీ మేయర్ అభ్యర్థిని అబ్దుల్ అబీదా అన్నారు. శనివారం ఆమె మంత్రి కొల్లు రవీంద్ర, టీడీపీ సీనియర్ నాయకులు కొనకళ్ల జగన్నాధరావు (బుల్లయ్య), గొర్రెపాటి గోపిచంద్ తోపాటు కూటమి కార్పొరేటర్ అభ్యర్థులతో కలిసి పలు డివిజన్ లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. గత మూడు రోజులుగా చేస్తున్న ప్రచారానికి ప్రజల నుండి మంచి స్పందన వస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ తనను తమ ఇంటి ఆడబిడ్డగా భావించి స్వాగతం పలుకుతున్నారన్నారు. తనపై ప్రజలు చూపుతున్న ఆదరాభిమానాలను ఎప్పటికీ మరువనని అన్నారు. అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానన్నారు. బందరు అభివృద్ధి చెందాలంటే కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు సహాయ సహకారాలతో మచిలీపట్నం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మేయర్ అభ్యర్థిని అబీదా ప్రజలకు హామీ ఇచ్చారు.

# అభివృద్దే ధ్యేయం..

**కూటమి మేయర్ అభ్యర్థి అబ్దుల్ అబీదా**





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** నగరాన్ని అభివృద్ధి, సంక్షేమ పథంలో ముందుకు నడిపించడమే లక్ష్యమని కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ మేయర్ అభ్యర్థి అబ్దుల్ అబీద అన్నారు. శనివారం నగర కార్పొరేషన్ 55వ డివిజన్ నందు కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి, పి. విమల గాయత్రి తో కలసి డివిజన్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు, మాదివాడ రాము, డివిజన్ తెలుగుదేశం పార్టీ నాయకులు, పి. వి. ఫణి కుమార్, గంజాల రవికుమార్, కొనకళ్ళ భాను ప్రసాద్, కోమటి వెంకటేశ్వరరావు, కొనకళ్ల అరుణ్ కుమార్, తోట శ్యామ్, సలకా కృష్ణ, అంజి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే దామచర్ల తో కలసి ప్రచారంలో పాల్గొన్న శ్రీ శిల్ప

## --శ్రీ శిల్పకు ప్రజానీరాజనం







**ఒంగోలు, కలంకౌంటర్ :** ఒంగోలు కార్పొరేషన్ మేయర్ టిడిపి అభ్యర్థి నల్లమల్లి శ్రీ శిల్పకు ఒంగోలు ప్రజలు అడుగడుగునా నీరాజనం పడుతున్నారు. శనివారం స్థానిక శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో కూటమి అభ్యర్థుల తరఫున మేయర్ అభ్యర్థి శ్రీ శిల్పతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రచారంలో ఒంగోలు ప్రజలు జననీరాజనం పలికారు. మహిళలు హారతులతో స్వాగతం పలికారు. ఒంగోలు పట్టణంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒంగోలు పట్టణం ఎంతో అభివృద్ధి చెందుతుందని, మేయర్ అభ్యర్థి శ్రీ శిల్పను, కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే ఒంగోలు అభివృద్ధిలో వారు కూడా భాగస్వామ్యులు అవుతారని, కావున మేయర్ అభ్యర్థి శ్రీ శిల్పను, కూటమి తరుపున పోటీ చేసిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు, కోటమి నాయకులు పాల్గొన్నారు.

# వేమూరి ట్రస్ట్ సేవలు అభినందనీయం

**-బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ**





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** వేమూరి వెంకటసుబ్బయ్య కుదరవల్లి సీతారామయ్య వేమూరి వెంకట రమేష్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం మచిలీపట్నం రాజుపేట లోని మదర్స పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోటు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన మదర్సా పాఠశాలలలో వేమూరి చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని అన్నారు. ఎక్కువ మంది నిరుపేద పిల్లలు చదువుకునే విద్యాసంస్థలను గుర్తించి వేమూరి వెంకట రమేష్ నగరంలో సేవా కార్యక్రమాలు కొనసాగించటం అభినందనీయమని అన్నారు. 200 మంది విద్యార్థులకు పుస్తకాలు పెనీలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ వేమూరి వెంకట రమేష్ మాట్లాడుతూ అన్ని మతాల సారాంశం మానవసేవే మాధవ సేవ అని అందరూ శాంతియుత సహజీవనం తో కలిసి ఉండాలని అన్నారు. న్యాయవాది రాజేష్ మాట్లాడుతూ వేమూరి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎందరో పేద విద్యార్థులకు సహాయం అందుతుందని పెద్దలు పేరుతో టెస్టులు ఏర్పాటు చేసి విద్యాదానం చేయటం అభినందనీయమని అన్నారు. మచిలీపట్నం రాజుపేట మదారస్ దారుల్ ఉలుమ్ అష్ రఫియా పాఠశాల ,ఫైజాని హలీమి పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో అబ్దుల్ రబ్బాని హలీమి, అమీర్, భాజాని, శ్రీనివాసు, సింగ్ తదితరులు పాల్గొన్నారు.

OWNER, PUBLISHER AND EDITOR BY : CH.VASAVIDEVI, PRINTED AT : SANAM VENKATA RAJASEKAR ARUNODAYA NOTE BOOK MANUFACTURERS PVT LMT, 33-5-9, 3RD FLOOR, PAPAIAH STREET, SEETHARAMPURAM, VIJAYAWADA, KRISHNA , AP - 520002. PRGI NO. APTEL/2016/69464. CELL 9346935672.